గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమైన పోలీసు పరేడ్ మైదానం

గణతంత్ర దినోత్సవ

వేడుకలకు ముస్తాబు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి, ఆర్డీవో

74వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబు అయ్యింది. గురువారం ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి బుధవారం నాడు పరేడ్ రిహార్సల్స్‌ను సమీక్షించారు. ముఖ్య అతిథులు హాజరు, వారి సీటింగ్, జాతీయ పతాక ఆవిష్కరణ, జాతీయ జెండాకు గౌరవ వందనం చేయడం తదితర వాటిని దగ్గరుండి పరిశీలించారు. ఎలాంటి అసౌకర్యాలు లేకుండా వేడుకలను పడక్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్డీవో మధుసూదన్‌లు కూడా పోలీసు పరేడ్‌ను పరిశీలించి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. జెండా వందనం దగ్గర నుంచి వందన సమర్పణ వరకు చేయాల్సిన అన్ని రకాల కార్యక్రమాలు క్రమ పద్ధతిలో నిర్వహించేలా చూడాలని ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్‌పై బిజెపి కుట్ర

అభివాదం చేస్తున్న విద్యార్థి యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు

- ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం
- అన్ని విధాలా అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రం
- హోదా పోరాటంలో అన్ని పార్టీలూ కలిసి రావాలి
- ఇది భవిష్యత్తు తరాల కోసం సాగిస్తున్న ఉద్యమం
- ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్
- అనంత నుంచి ప్రత్యేక హోదా బస్సు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసేలా బిజెపి భయంకరమైన కుట్ర చేస్తోందని విద్యార్థి, యువజన, ప్రత్యేక హోదా సాధన సమితి, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు చేపట్టిన బస్సుయాత్ర బుధవారం నాడు అనంతపురం నగరంలో ప్రారంభం అయ్యింది. ముందుగా నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడి నుంచి పివికెకె కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు ఓతురు పరమేష్, చిరంజీవి అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. అనంతరం బస్సుయాత్రను ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలఓ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర నాయకుడు జి.ఓబులు, పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు మేనల్లుడు సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న పాటు విద్యార్థి, యువజన సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఇందులో పాల్గొన్నారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం : చలసాని

ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా అడుగడుగునా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తరువాత మరో మాట చెప్పి రాష్ట్రానికి ద్రోహం చేస్తోందన్నారు. బిజెపి చేస్తున్న ఈ అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలన్నారు. ప్రత్యేక హోదా ఉద్యమం వ్యక్తుల కోసం కాదని, ఇది విద్యార్థి, యువజనులు, ప్రజల భవిష్యత్తుకు సంబంధించినది అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రత్యేక హోదా ఉద్యమంలో పాలుపంచుకోవాలన్నారు. అనంతపురంలో ప్రారంభం అయిన బస్సుయాత్ర ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రానికి బిజెపి చేస్తున్న మోసాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామని తెలియజేశారు.

ముఖ్యమంత్రి, వైసిపి ఎంపీలు ఏం చేస్తున్నారు.. : రామకృష్ణ

ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయకుండా బిజెపి మోసం చేస్తున్నా దానిని ప్రశ్నించకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసిపి ఎంపీలు ఏం చేస్తున్నారంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. బిజెపి అధికారం చేపట్టి ఎనిమిదేళ్లు పూర్తయినా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ప్రజలకు మేలు చేయకుండా ఏపీలో తమని గెలిపించాలని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కోరడం సిగ్గుచేటన్నారు. సోము వీర్రాజుకు సిగ్గుంటే బిజెపి రాష్ట్రానికి ఏమిచేసిందో చెప్పాలన్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి బిజెపికి భయపడి ప్రత్యేక హోదాపై మాట్లాడకుండా మౌనంగా ఉందన్నారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు 31 మంది ఎంపీలను ఇస్తే ఇప్పుడు ఏమీ చేయలేక గాడిదలు కాస్తున్నాడా అని ప్రశ్నించారు. వైసీపీ ఎంపీలందరూ ప్రత్యేక హోదా గురించి మాట్లాడకుండా పార్లమెంట్‌లో నిద్రపోతున్నారంటూ ఎద్దేవా చేశారు. వైసిపి ఎంపీలు చేతగాని దద్దమ్మల్లా ఉంటూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు రాయలసీమ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని విద్యార్థి యువజన సంఘాలు చేపట్టిన సమరయాత్రకు సిపిఐ పూర్తిగా మద్దతుగా ఉంటుందని తెలియజేశారు.

ప్రత్యేక హోదాతోనే మన భవిష్యత్తు
సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు

అడ్డగోలుగా విభజించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు తెలిపారు. విభజన హామీలు అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి దగా చేసిందన్నారు. వెనుకబడిన ప్రాంతానికి పరిశ్రమలు రావాలన్న, ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావాలన్న ప్రత్యేక హోదా ఇస్తేనే సాధ్యమవుతుందని చెప్పారు. జాతీయ సంస్థలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఏర్పాటు చేయలేదన్నారు. సెంట్రల్ యూనివర్శిటీకి 8 సంవత్సరాలు కావస్తున్న ప్రహరీ కూడా కట్టని దౌర్భాగ్య స్థితి ఉందన్నారు. రాష్ట్రం పట్ల మోదీ ప్రభుత్వం వివక్ష చూపుతుంటే రాష్ట్ర ప్రభుత్వం సాగిలపడి వ్యవహరించడం మరింత నష్టం కలిగిస్తోందన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి
పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు.

రాష్ట్రానికి హోదా ఇస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు తెలిపారు. పేదరిక నిర్మూలనకు, యువత, విద్యార్థులకు విద్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కోసం ఎపికి ప్రత్యేక హోదా కల్పిస్తున్నట్లు నాటి ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. విభజనకు సహకరించి బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విద్యార్థి యువజన సంఘాలు చేస్తున్న పోరాటాల్లో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు.

ఓట్లు సీట్ల కోసం చేస్తున్న యాత్ర కాదు
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్.

రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు, యువత శ్రేయస్సుకు, భవిష్యత్తు కోసం ప్రత్యేక హోదా సాధన అవసరం అనిఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం చేస్తున్న బస్సుయాత్ర ఓట్లు, సీట్ల కోసం చేస్తున్నది కాదని, మనందరి బాగోగుల కోసం చేస్తున్న యాత్ర అన్నారు. ప్రభుత్వాలు అనేక అడ్డంకులు సృష్టించి యాత్రను అడ్డుకోవాలని చూసినా, న్యాయవ్యవస్థ ద్వారా యాత్రను కొనసాగిస్తున్నాం అన్నారు.

బిజెపి మెడలు వంచుదాం..
డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న

రాష్ట్రానికి మేలు జరగాలంటే హోదా ఒక్కటే మార్గం అని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న తెలిపారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. పోరాట పటిమను సాహిత్యంతో చాటి చెప్పిన వేమన స్ఫూర్తితో సమరశీల పోరాటం సాగించాలన్నారు. పట్టు విడవకుండా మోదీ ప్రభుత్వం మెడలు వంచైనా హోదా సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అనంతపురం, పుట్టపర్తి జిల్లా కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, ప్రొఫెసర్ సదాశివానంద రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు గిరి, సిద్ధార్థ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ బాబు, రాజేంద్ర, పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాజశేఖర్, బిసిఆర్పిఎస్ జాతీయ అధ్యక్షుడు సాకే నరేష్, బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ నాయకుడు సురేష్, ఎఐఎస్ఎ రాష్ట్ర అధ్యక్షుడు వేమన్నతో పాటు విద్యార్థి యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

పనిముట్లు ఇవ్వరు..యూనిఫాం ఊసేలేదు..

ఎమ్మెల్యేకు గోడు వెళ్లబోసుకున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'కార్మికులకు పనిముట్లు ఇవ్వరు.. యూనిఫాం ఊసే లేదు.. కార్మికుల సమస్యలు, రావాల్సిన ప్రయోజనాలను ప్రస్తావిస్తే కమిషనర్ భాగ్యలక్ష్మి చూస్తామంటూ ఒక్క నిమిషంలో పంపేస్తారు.. సమస్యలను విన్నవిస్తే చర్చించరు, పరిష్కరించరు. ధర్నాలు చేస్తే పరిష్కరిస్తామంటూ చెప్పటమే కానీ ఆచరణలో చేసింది ఏమీ లేదు'.. అని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డిని ఆయన స్వగృహంలో బుధవారం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే కమిషనర్ భాగ్యలక్ష్మికి ఫోన్ చేసి కార్మికుల సమస్యలకు మూడు రోజుల్లో పరిష్కారం చేపాలని సూచించారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదని హితవుపలికారు కార్మికులకు సమస్యలు ఉన్నప్పుడు ఉన్నతాధికారి, పాలకవర్గం ముఖ్యనేత మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘంతో కలిసి కూర్చుని పరిష్కారం చేసుకునే దిశగా చర్చించాలన్నారు. కార్మికుల పనిముట్లు, రక్షణ పరికరాలు సకాలంలో అందించకుంటే వారు పారిశుధ్య పనులు ఎలా నిర్వహిస్తారని మందలించారు. సత్వరం కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం కనుగొనాలని సూచించారు. అర్బన్ ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, ఎర్రిస్వామి, శేషేంద్రకుమార్, తిరుమలేశు, నల్లప్ప, ముత్తు, మరియమ్మ, వెంకటనారాయణ, ముర్తుజ, మలేరియా, గార్బేజ్ ఇంజనీరింగ్, క్లాప్ కార్మికులు ఉన్నారు.

శరవేగంగా అంతర్గత రోడ్ల అభివృద్ధి

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో శరవేగంగా అంతర్గత రోడ్ల అభివృద్ధి చేపడుతున్నట్లు నగర మేయర్ మొహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 29వ డివిజన్ పరిధిలో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ పనులకు మేయర్ వసీం బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్ రెడ్డి, వాసంతి, కార్పొరేటర్ సైఫుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు. త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయించాలని అధికారులకు మేయర్ సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలు తీసుకువచ్చిన సమస్యల తక్షణ పరిష్కారం కోసం సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరుచేసి నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. నగరంలో సిమెంట్ రోడ్ల ఏర్పాటుతోపాటు డ్రైనేజీలను కూడా ఏర్పాటుచేసి పారిశుధ్య మెరుగునకు చర్యలు చేపట్టామన్నారు. రూ.25 కోట్లతో స్పెషల్ గ్రాంట్ నిధులు కూడా మంజూరు అయ్యాయన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీల నేతలకు ప్రజలు, అభివృద్ధి గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. వారు చేసే జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీపై డీలర్లకు సూచనలు

రాయదుర్గం : చౌక దుకాణపు డీలర్లు, ఎండియు ఆపరేటర్లు ప్రజలకు నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని అధికారులు సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో చౌక దుకాణపు డీలర్లు, ఎండియు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు డీలర్లు, ఆపరేటర్లు ప్రతినెల మొదటి తేదీ నుండి 15వ తేదీలోగా రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు, తూకం సక్రమంగా వేసి సరుకులు అందజేయాలన్నారు. బియ్యం పంపిణీ సమయంలో ఎండియు ఆపరేటర్ ఈపాస్ రసీదును రేషన్ కార్డుదారునికి ఇవ్వాలన్నారు. ప్రతి చౌక దుకాణపు డీలర్ నిర్ణీత గడువులోగా డీడీలు తీయాలని, అర్ఒను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. చౌక దుకాణపు డీలర్లు, ఎండియు ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఆర్ఐ జీవన్, డీలర్లు, ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కలెక్టరేట్ : జీడిపల్లి, బీటీపి, కుందుర్పి కాలువల భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి సోమర రాహుల్, ఆర్‌సిసి రాష్ట్ర అధ్యక్షులు శివనంద, రాయలసీమ కళా వేధిక జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే మల్లికార్జున, ఎమ్మెల్సీ అభ్యర్థి టిపి.రామన్న, ఎఐఎఫ్‌బి రాష్ట్ర నాయకులు పృధ్వీ డిమాండ్ చేశారు. బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. రానున్న బడ్జెట్‌లో జీడిపల్లి, బీటీపి, కుందుర్పి ప్రాజెక్టుల భూ నిర్వాసితుల కోసం నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు.

ఎస్కేయూలో రూ.3.91 కోట్ల పనులకు ఆమోదం

ఉపకులపతి ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బిల్డింగ్ కమిటీ రూ.3.91 కోట్ల పనులకు ఆమోదం తెలిపినట్లు ఎస్కేయూ ఉపకులపతి ఆచార్య ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వర్సిటీ ఉపకులపతి అధ్యక్షతన జరిగిన బిల్డింగ్ కమిటీ సమావేశంలో వర్సిటీ చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాల పై సుదీర్ఘ చర్చ జరిగింది. అనంతరం ఎస్కేయూ ఉపకులపతి వాటి వివరాలను వెల్లడించారు. అందులో ప్రధానంగా రూ.2.31 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రోడ్డు నిర్మాణపనులు లా భవనం దగ్గర నుండి మొదలై విద్యుత్ ఆఫీస్, క్యాంటీన్, పూలే భవనం, కామన్ మెస్ వరకు వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. న్యాక్ కమిటీ ఎస్కేయూ పరిశీలనకు వస్తున్న నేపథ్యంలో రూ.40 లక్షల నిధులతో విశ్వవిద్యాలయ భవనాలకు పెయింటింగ్స్ వేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటివరకు నిలిచి పోయిన బాలుర, బాలికల హాస్టల్స్ అభివృద్ధి పనులను తిరిగి రూ.1.20 కోట్లతో పునరుద్ధరించాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ఆచార్య ఎ.మల్లికార్జున్‌రెడ్డి, రిజిస్టర్ ఆచార్య ఎంవి.లక్ష్మయ్య, ఎస్కేయూ పాలకమండలి సభ్యులు మహిదర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ మధుసూదన్ రెడ్డి, అనంతపురం జిల్లా రోడ్లు, భవనాల సూపరింటెండెంట్ ఇంజినీర్, ఎస్కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీరాములు, ఆచార్య నాగభూషణం రాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు పెద్దయ్య కన్నుమూత

పార్టీ జెండా కప్పి నివాళులర్పించిన సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు మండల కంద్రానికి చెందిన కామ్రేడ్ గుడిపాడు పెద్దయ్య మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. పెద్దయ్య భౌతికకాయంపై సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రసన్న, రంగన్న, మండల కమిటీ నాయకులు ఎర్రజెండా కప్పి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. పెద్దయ్య జెవివిలో, వ్యవసాయ కార్మిక సంఘంలో, సిపిఎంలో పనిచేశారన్నారు. వ్యవసాయ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని, కనీస వేతనం ఇవ్వాలని ఉద్యమం చేయడంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, సహాయ కార్యదర్శి మద్దిలేటి, క్రిష్ణనారాయణ, రైతు సంఘం ఈశ్వర్‌రెడ్డి యాదవ్, వన్నూరువలి, జెవివి జిల్లా నాయకులు జంగం శ్రీనివాసులు, నూర్ మొహమ్మద్, రామకృష్ణ, హరికృష్ణరావు, గుత్తి నాయకులు మున్ని, మల్లికార్జున, గొర్ల సంఘం జిల్లా నాయకుడు చంద్ర, జిల్లా కళాకారులు లక్ష్మీనారాయణ, రాజా, టిడిపి సీనియర్ నాయకులు బాషా, సీనియర్ మాజీ జర్నలిస్ట్ బాలకృష్ణ, సచివాలయ బిల్ కలెక్టర్ జయరాముడు తదితరులు నివాళులర్పించారు.

పెద్దయ్య భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో పెద్దయ్య ఫైల్‌ఫొటో)

విప్లవ జోహార్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

వృథాగా పోతున్న తాగునీరు

వృథాగాపోతున్న తాగునీరు

చోద్యం చూస్తున్న అధికారులు

ఆత్మకూరు : మినీ ట్యాంకు కనెక్షన్ లేకపోవడంతో ఆత్మకూరు మండల కేంద్రంలోని సత్యసాయి సాగునీరు వృథాగా పోతోంది. దీంతో పలు కాలనీల్లో తాగునీరు సరిగా సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టి నీటి ఎద్దడిని నివారించాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర కోరారు. లేని పక్షంలో కాలనీవాసులతో కలిసి పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం

పుట్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో ఫీల్డ్అసిస్టెంట్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ..ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని, మండలంలో ఉపాధి పనులకు రోజూ రెండు వేల మంది కూలీలు వచ్చేలా చూడాలని సూచించారు. పని ప్రదేశం నుండి రెండు ఫొటోలు తప్పనిసరిగా పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

ఎంపిపి విద్యావతికి పితృవియోగం

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం ఎంపిపి విద్యావతికి పితృవియోగం కలిగింది. అనారోగ్య కారణాలతో బుధవారం శివారెడ్డి (79) మతి చెందారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బోర్‌వెల్ నాగిరెడ్డి, పలువురు వైసిపి నాయకులు సానుభూతి తెలిపారు. మండల పరిధిలోని బొమ్మకపల్లి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

శింగనమల : ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యులు డేగల కృష్ణమూర్తి చేతుల మీదుగా గుమ్మేపల్లి గ్రామంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాశక్తి దినపత్రిక నిజాలను నిర్భయంగా రాస్తుందన్నారు. పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తెస్తూ మర్ని కాలాలపాటు ఈ పత్రిక వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుమ్మేపల్లి సర్పంచి డేగల లలితమ్మ, డేగల శ్రీనివాసులు, టిడిపి బీసీసెల్ కార్యనిర్వాహ కార్యదర్శి కోయగూర పెద్దన్న, డేగల కిరణ్, డేగల హరీష్, తరిమెల చిరంజీవి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL - III AT BALLARI

MVC No.554 of 2022

Between:

Vinay Kumar Naik and another ...Petitioners

And

Chikkala Naga Subramanyam and others ...Respondents

To

Respondent No.1

Sri Chikkala Naga Subramanyam @ Naga Subramanyam.C S/o Late C.Narapuram, aged about 48 years, Driver of the Lorry bearing Reg.No. AP-02/TB-8297 R/o D.No.8-177, O, Shanthi Nagar, Tadipathri Town. AND D.No.7-226, Manlyar Street, Near Ammavarishala, Tadipathri Town, Ananthapuram District.

Respondent No.2

Sri.Sreekanth Reddy, S/o C.Sreenivasulu Reddy, aged about 56 years, Owner of the Lorry bearing Reg.No.AP-02/TB-8297, R/o No.1-366, Near Ramalaya Temple, Nandyala Road, Tadipathri Town, Ananthapuram District.

NOTICE

As, the above named petitioner has filed the above claim petition against you No.1 and 2 and another respondent under section 166 of Motor Vehicle Act for seeking compensation for the sustained grevious nature of fractures and injuries by the petitioner in the motor vehicle accident, which taken place on 12-10-2019 at about 11-30 p.m. on NH-544DD, B.T. Road, near P.Siddarampuram Cross, near Atmakur.

You are hereby directed to appear before this Honourable court in person or by a pleader duly instructed on 22-02-2023 at about 11.00 a.m., in the forenoon before this Honourable Court to show cause against you failing which the petition will be heard and determined as ex-parte.

Given under my hand and seal of the court on this 24 day of January, 2023.

(By Order of the Court)

(A.B. LOKESH)

Advocate for the Petitioner.

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం

అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి ఏ మాత్రం జరగలేదని టిడిపి బీసీ సెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు ఆర్.హరినాథ్ గౌడ్, ఆర్.అనిల్ గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని కె.ఊబిచెర్ల, కరిడికొండ గ్రామాల్లో బుధవారం సాయంత్రం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ నాయకులు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలు, ఆక్రమణల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏపీ అని అన్నారు. రాజధాని లేకుండా పరిపాలన సాగించడం శోచనీయమన్నారు. గ్రామాల్లో సమస్యలు నెలకొన్నా వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామ సర్పంచుల నిధులను జగన్ పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. గతంలో తమ ప్రభుత్వం నిధులు కేటాయించి అన్ని వర్గాల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు తోడ్పాటును అందించారన్నారు. రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు పరిపాలన కొనసాగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కాయపాటి సుధాకర్ యాదవ్ పార్టీలోకి చేరాడు. నాయకులు ఆయనకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవి గౌడ్, సర్పంచి భరత్ కుమార్, ఎంపీటీసీ ధనుంజయ, మాజీ ఎంపీపీ వీరేష్, నాయకులు మోడే శ్రీనివాస యాదవ్, దిల్కా శీనా, కరిడికొండ సుధాకర్, ప్రభాకర్, గోవర్ధన్ గౌడ్, మహమ్మద్ అలీ, వెంకటనారాయణ, అగ్గిరాముడు, పి. సుధాకర్, మాజీ కౌన్సిలర్లు కె.గోవిందు, జి.సుంకన్న, మాజీ సర్పంచులు వెంకట రాముడు, నరసింహులు, శ్రీనివాస్ చౌదరి, వైకుంఠ, సుంకన్న, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు నీరు వదలాలి

30న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి బ్రాంచి కెనాల్ ఆయకట్టుకు నీరు వదలాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాజారాంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని తేరన్నపల్లి, తిమ్మాపురం, రావి వెంకటంపల్లి, చిన్నపల్లి, తాతగారిపల్లి, కోమలి, చిన్నపడమల, పెద్దపడమల, ఎగువపల్లి, కొనుగుంటపల్లి, ఎర్రగుంటపల్లి గ్రామాల్లో రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రెండవ, మూడవ, నాలుగవ డిస్ట్రిబ్యూటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయకట్టు కింద ఉన్న కాలువలను అధికారులు పరిశీలించి నీరు విడుదల చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా ఆయకట్టు కింద ఉన్న 2000 ఎకరాల భూములకు నీరు అంది రబీ సీజన్లో రైతులు పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆయకట్టు కింద రైతులు మొక్కజొన్న, వేరుశనగ, ఉద్ది, ధనియాలు తదితర పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. ఆయా కాలువలకు నీరు అందించి పంటలు ఎండిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ఆయకట్టు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మండల రైతులు కేశవరెడ్డి, హాజీవలి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రంగనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖహాజరు విధానాన్ని రద్దుచేయాలి

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు విధించిన ఫేస్ రిజిస్టర్ మస్టర్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కసాపురం రమేష్, ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విశ్వనాథ్‌కు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగులతో పాటు ఒప్పంద కార్మికులకు కూడా నూతన హాజరు విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించడం సరికాదన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఒప్పంద కార్మికుల్లో, మునిసిపల్ పర్మినెంట్ కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. మున్సిపల్ కార్మికుల్లో స్మార్ట్ ఫోన్‌లకు సంబంధించి నైపుణ్యం లేని కార్మికులు, స్మార్ట్‌ఫోన్లు లేని వారు అధికంగా ఉన్నారన్నారు. కార్మికులకు ముఖ హాజరు విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.నరసయ్య, సిఐటియు నాయకులు తిమ్మప్ప, ఎఐటియుసి నాయకులు కొండన్న తదితరులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ అభివృద్ధికి కృషి

ప్రమాణస్వీకారం చేయిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజల భాగస్వామ్యంతో టౌన్ బ్యాక్ అభివృద్ధికి కృషి చేస్తామని టౌన్ బ్యాంక్ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు సాధు కుళ్లాయస్వామి, చంగల మహేష్ తెలిపారు. బుధవారం ఉరవకొండ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. మొదట 11 మంది సభ్యుల చేత రిటర్నింగ్ అధికారి బాలగంగాధర్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం అధ్యక్షులుగా సాధు కుళ్లాయస్వామిని, ఉపాధ్యక్షులుగా చంగల మహేష్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ సభ్యుల సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని, బ్యాంకును లాభాల బాట పట్టిస్తామని హామీ ఇచ్చారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి బ్యాంకు ఆదాయాన్ని పెంచే దిశగా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు, డైరెక్టర్లకు ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, కోఆప్షన్ పామిడి సలీం, జిల్లా వక్ఫ్‌బోర్డు మెంబర్ మీరంబాషా, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పట్టణ అధ్యక్షుడు బ్యాంక్ ఓబులేసు పూలమాలలు, శాలువలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులు వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.ప్రణయ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ సిఇఒ వేదమూర్తి, సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

జెఎన్‌టియులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ అనుబంధ ఒటిపిఆర్ఐ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని సంచాలకులు ఆచార్య బి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓటు హక్కుపై, ప్రజాస్వామ్య వ్యవస్థ పైనా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం కుల,మత, వర్గం, భాషా ఎత్తుగడలకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థులచేత ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.గోపీనాథ్, ఓటీపీఆర్ బోధన, బోధనేతర, అవుట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గేట్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి తహశీల్దార్ ఎస్. మహబూబాషా మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ ఐడి ఎలా పొందాలో ఆన్‌లైన్ ద్వారా ఆయన వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ వికె.శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ అరవింద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : భారతీయ పౌరులుగా ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ రఘురాంమూర్తి సూచించారు. స్థానిక కెటిఎస్.డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తహశీల్దార్ మారుతి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఓటు ప్రాధాన్యత, ఓటరు క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నారాయణ, రామకృ, గోవర్ధన్ పాల్గొన్నారు.

నార్పల : స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణంలో తహశీల్దార్ సురేష్ ఓటు హక్కు వినియోగంపై విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్‌పి హైస్కూల్ నందు తహశీల్దారు షర్మిల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ, బిఎల్ఒలు పాల్గొన్నారు.

గుత్తి గేట్స్ కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

ఉచిత జీరో అకౌంట్, లేబర్‌కార్డుల క్యాంపు

కార్మికులకు జాబ్‌కార్డులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

కావేరసముద్రం గ్రామానికి చెందిన మిద్దె చిన్న పుల్లారెడ్డి సేవాసమితి అధ్యక్షులు మిద్దె శ్రీరామిరెడ్డి ఆధ్వర్యంలో భోగసముద్రం గ్రామపంచాయతీలో కార్మికులకు ఉచిత జీరో అకౌంట్, లేబర్ కార్డుల క్యాంపును బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహశీల్దారు మునివేలు హాజరై మాట్లాడుతూ.. మిద్దె చిన్న పుల్లారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. భోగసముద్రం గ్రామంలో ఎంతోమంది సిమెంట్ పరిశ్రమలో పనిచేసే కార్మికులు ఉన్నారన్నారు. లేబర్ కార్డులు, జీరో అకౌంట్ చేయించుకోవాలంటే కార్మికులు సెలవు పెట్టాల్సి వచ్చేదన్నారు. ఇలాంటి క్యాంపులు కార్మికులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్‌తో పాటు కార్మికులు జీతాలను అకౌంట్‌లో జమ చేసుకోవచ్చునని అన్నారు. చిన్న పుల్లారెడ్డి సేవాసమితి భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సేవలు అందించాలని కోరారు. అనంతరం సేవా సమితి ఉపాధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ.. చిన్న పుల్లారెడ్డి తమకు ప్రాణ స్నేహితుడన్నారు. స్నేహితుని పేరిట సేవా సమితి ఏర్పాటు చేసి మండల ప్రజలకు సేవలు అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతూ చదువుకోవడానికి చొరవ చూపే విద్యార్థులకు సేవా సమితి తరపున చదివిస్తామని తెలిపారు. సేవా సమితి కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో సేవాసమితి ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. అధ్యక్షులు మిద్దె శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ.. తమ తండ్రి చిన్న పుల్లారెడ్డి ఎంతోమందికి సహాయపడ్డారన్నారు. ఆయన చేసిన సేవల్లో పది శాతమైనా చేయాలన్న ఉద్దేశంతో సేవాసమితి ఏర్పాటు చేశామన్నారు. సేవాసమితిలో ఉన్న ఫండ్స్‌లో 80 శాతం విద్యకు ఖర్చు పెడతామన్నారు. అనంతరం సేవా సమితిలోకి కొత్త సభ్యులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మిద్దె హనుమంత రెడ్డి, భోగసముద్రం, కావేరిసముద్రం గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

చిరుదాన్యాలతోనే మానవులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని విడపనకల్లు మండల వ్యవసాయ అధికారి హెచ్.పెన్నయ్య పేర్కొన్నారు. బుధవారం ఉండబండ గ్రామంలో ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకొని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని పలు వీధుల్లో చిరుధాన్యాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. చిరుధాన్యాల ఆవశ్యకతను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం జీవో 28 విడుదల చేసిందన్నారు. చిరుధాన్యాలకు రూ.2500 మద్దతు ధరను ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వలన రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందన్నారు. మధుమేహం, స్థూలకాయం, ఆస్తమా, రొమ్ము క్యాన్సర్ లాంటి వ్యాధులను నివారిస్తుందన్నారు. రైతులు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని వారి పొలాలలో చిరుధాన్యాల పంటలు వేయడానికి ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ మునాఫ్, రైతులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక ఆదిమూర్తి నగర్ ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం విద్యార్థినులు కె.రాహేల్ రాణి, కె.నందిని, కె.మణి జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 కబడ్డీ పోటీలలో పాల్గొని వీరు విజేతలుగా నిలిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి, సూపరింటెండెంట్ నాగరత్నమ్మ, అనంతపురం డివిజన్ సహాయ బీసీ సంక్షేమ అధికారి సుభాషిని, వసతి గృహ సంక్షేమ అధికారి టి.ఆదిలక్ష్మి అభినందించారు. విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో కూడా పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

కామ్రేడ్ కె.ఆంజనేయులుకు నివాళి

ప్రజాశక్తి-గుంతకల్లు

సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ కె.ఆంజనేయులు 13వ వర్ధంతిని సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్ అధ్యక్షతన స్థానిక హంపిరెడ్డి భవనంలో బుధవారం నిర్వహించారు. ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు మాట్లాడుతూ కామ్రేడ్ కె.ఆంజనేయులు కార్మికుల పక్షాన వారి సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నడిపారన్నారు. మున్సిపల్ కౌన్సిల్లో కోఆప్షన్స్ సభ్యులుగా ఉండి ప్రజా, కార్మిక సమస్యల పైన ప్రజా ప్రతినిధులను నిలదీశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగ్గిలి రమేష్, తిమ్మప్ప సిఐటియు నాయకులు బాషా, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న పిసిఎం నాయకులు

అన్నదానానికి ఆర్థిక సాయం

రాయదుర్గం రూరల్ : శివమాలాదారుల అన్న సంతర్పణకు రాయదుర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప రూ.5100 ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం బండి కిష్టప్ప గృహంలో శివ మాలాదారులకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సేవా సమితి న్యాయ సలహా దారులు రవిచంద్ర, శివదీక్ష గురుస్వామి రవి, రామాంజనేయులు, మల్లారెడ్డి, రామాంజనేయులు, చిత్తయ్య, వాల్మీకి యవత హరీష్ కుమార్, సేవా సమితి మీడియా సలహాదారులు ప్రకాష్, రుద్ర పాల్గొన్నారు,

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

బందార్లపల్లి గ్రామానికి చెందిన 140 కుటుంబాల వారు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో బుధవారం వైసిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిచారు. గ్రామానికి చెందిన రామాంజనేయులు, రంగస్వామి, హనుమంతు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, నాగరాజు, ఆదినారాయణ, రామాంజనేయులు, రమేష్ కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు ఛైర్మన్ హరినాథ్ రెడ్డి, కన్వీనర్ శరభారెడ్డి, నాయకులు శేషానంద్‌రెడ్డి, వెంకటస్వామి గౌడ్, పాశం రంగస్వామి యాదవ్, రామచంద్రరెడ్డి, నాగరాజు, బ్రహ్మానందరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న ఐఎఫ్‌టియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు పట్టణంలోని శ్రీ గుంతకల్లప్ప కల్యాణ మండపంలో ఫిబ్రవరి 4వ తేదీన జరుగనున్న ఐఎఫ్‌టియు జిల్లా మహాసభను ప్రజలు విజయవంతం చేయలను ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు బి.సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బి.సురేష్ మాట్లాడుతూ మహాసభను విజయవంతం చేయడానికి ఐఎఫ్‌టియు కార్యకర్తలు గట్టిగా పని చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం మీద ఉక్కు పాదాన్ని మోపుతూ వారి హక్కులను హరించి వేస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. లేబర్ కోడ్‌లతో కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లు యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుండడంతో ఉద్యోగులు అభద్రతా భావంతో ఉన్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమాల బాటపట్టి నరేంద్రమోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు గుంతకల్లు డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, చిన్నా, కమిటీ సభ్యులు రఘునాథ రెడ్డి, జిలాన్, దేవేంద్ర, గోపి, గంగాధర్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ క్లీనిక్‌ను పరిశీలించిన నీతి అయోగ్ కమిటీ

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల పరిధిలోని కోప్పలకొండ గ్రామంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లినిక్‌ను నీతి అయోగ్ కమిటీ బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లినిక్ ద్వారా రక్తపోటు, చెక్కర వ్యాధి గ్రస్తులకు అందిస్తున్న సేవలు, రక్త పరీక్షలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, గ్రామ ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లినిక్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సదుపాయాలపై ఆరాతీశారు. తరువాత రికార్డ్స్ నిర్వహణను పరిశీలించారు. 108, 104 వాహనాల ద్వారా అందుతున్న సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నీతి అయోగ్ కమిటీ సభ్యులు సుమన అరోరా, మిశ్రా, శ్రేష్టా హాజ్రా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. వీరబ్బాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, జిల్లా ఉన్నతాధికారులు సుబ్రమణ్యం, నారాయణస్వామి, చెన్నకేశవులు, సుజాత, మండల వైద్యాధికారి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

వర్తకులతో మున్సిపల్ కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని వర్తకులతో మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి తన ఛాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీ నుండి ప్లాస్టిక్ ఫ్లెక్సీల ముద్రణ, ప్రకటన, చలామణి పూర్తిగా నిషేధించబడిందన్నారు. ఇదివరకే ఏవైనా ఫ్లెక్సీలు ఉన్నట్లయితే వాటిని తొలగించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ముద్రించినా, ప్రకటన చేసినా, వాడకంలో ఉంచినా, నిబంధనల మేరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వారి ట్రేడ్ లైసెన్స్‌ను రద్దుచేస్తామని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ నెల ఆఖరుకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించినా, విక్రయించినా, చలామణి చేసినా వారిపై జరిమానా విధించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వ్యాపారులు, ప్రజలు పాటించి పురపాలక సంఘం సిబ్బందికి సహకరించాలని కమిషనర్ వర్తకులను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, వివిధ రంగాలకు చెందిన వ్యాపారస్తులు, ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.